సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 29 । మే । 2024



అప్పన్నకు భారీగా ఆదాయం
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. 8లో



గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీ
అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి విశాఖలో మంగళవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. 8లో



ఘనంగా అమ్మవార్ల పండగ
గాజువాక సమీప నాతయ్యపాలెంలో కొలువైన బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ పండగ వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

మరో ముగ్గురు అటవీ అధికారులపై వేటు

• టేకు చెట్లు మాయం కేసులో సస్పెన్షన్

రంపచోడవరం : దేవరపల్లి ఫారెస్టు సెక్షన్ పరిధిలో టేకు చెట్లు కలప మాయం కేసులో మరో ముగ్గురు అటవీశాఖ అధికారులపై వేటు పడింది. దీనిలో భాగంగా రంపచోడవరం రేంజ్ అధికారి ఆజాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుమంతు, గార్డు శివారెడ్డిని సస్పెండ్ చేస్తూ అటవీ శాఖ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవరపల్లి సెక్షన్ అటవీ పరిధిలో సుమారు 500 టేకు చెట్లు స్మగ్లర్లు మాయం చేశారు. ఈ కేసులో ఇప్పటికే డీఆర్వో జాన్‌బాబు, బీట్ ఆఫీసర్ శ్రీలక్ష్మి వసంతలను సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు మంగళవారం తాజా మరో ముగ్గురు అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకున్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి 31న కౌన్సెలింగ్

రంపచోడవరం : రంపచోడవరం, చింతూరు డివిజన్‌లో ఆరు గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో సీట్ల భర్తీకి ఈ నెల 31న రెండో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఓ ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం, కూనవరం, రాజవొమ్మంగి, వై.రామవరం బాలికల కళాశాలలు , రంపచోడవరం , మారేడుమిల్లి బాలుర కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి రెండో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో రంపచోడవరం, మారేడుమిల్లి,అడ్డతీగల, వై.రామవరం గురుకుల జూనియర్ కళాశాలల్లో, చింతూరు ఐటీడీఏ పరిధిలో కూనవరం, బాలికల ఏపీఆర్ జేసీ, చింతూరు బాలుర ఏపీఆర్ కళాశాల్లో ఈ ప్రక్రియ జరుగుతుందని పీవో పేర్కొన్నారు.

విస్తృతంగా తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసు బలగాలు

వై.రామవరం: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.దీనిలో భాగంగా మండల సరిహద్దు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో మంగళవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను, వాటిలో రవాణా చేస్తున్న సామగ్రిని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహించాయి.


పాలిసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుజాత

సాక్షి,పాడేరు: పాలిసెట్-2024కు సంబంధించి అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రశాంతంగా జరుగుతోంది. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు 12,001 ర్యాంకు నుంచి 27,000 ర్యాంకు వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత, అధికారులు,సిబ్బంది పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వచ్చే నెల 3వతేదీ వరకు ర్యాంకుల వారీగా అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

మన్యంలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు



నిర్మానుష్యంగా పాడేరు పాత బస్టాండ్

సాక్షి,పాడేరు: మన్యంలో మళ్లీ భానుడు విజృంభించాడు. మంగళవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత నెలకొంది.మధ్యాహ్నం 12గంటలకు ఎండ మరింత విజృంభించింది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 36.5 డిగ్రీలు, అరకులోయలో 34డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 33 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు.

వన్యప్రాణులపై తూటా..!



అడవులు.. వన్యప్రాణులు, ఈ ప్రకృతి మన ఉనికికి పునాది. వీటి విధ్వంసం లేదా అంతరించిపోవడం మానవ మనుగడకు పెద్ద ముప్పు అనే విషయాన్ని విస్మరిస్తున్నారు. ఒకప్పుడు వన్యప్రాణులతో సందడిగా ఉండే మర్రిపాకల అటవీ ప్రాంతం నేడు వెలవెలబోతోంది. ఈ ప్రాంతంలో వందల సంఖ్యలో ఉండే వన్యప్రాణులు విచ్చలవిడిగా వేటాడటం వల్ల నేడు మచ్చుకైనా కనిపించడం లేదు. అక్కడక్కడ అరకొరగా ఉన్నా.. వాటిని కూడా వదిలి పెట్టడం లేదు. ఒడిశా వేటగాళ్లు వన్యప్రాణుల మాంసంతో భారీగా వ్యాపారం చేయడం వేట ఏ స్థాయిలో జరుగుతుందో చెప్పేందుకు అద్దంపడుతోంది.

• విచ్చలవిడిగా అడవి జంతువుల వేట
• ఒడిశా వేటగాళ్ల పంజాకు కనుమరుగు
• మర్రిపాకలు అటవీప్రాంతంలో కానరాని పులులు
• అంతరించి పోయిన అడవి గేదెలు, కణుజులు
• నాడు సందడి.. నేడు వెలవెల



వేటగాళ్ల తూటాలకు బలైన అడవిపంది (ఫైల్)



ఉచ్చులో పడి మృతి చెందిన కణుజు (ఫైల్)



మర్రిపాకల రేంజ్‌లో వన్యప్రాణుల వేట జరిగే దట్టమైన అటవీ ప్రాంతం

కొయ్యూరు: మండలంలోని మర్రిపాకల అటవీ ప్రాంతంలో అడవి గేదెలు (బైసన్స్), కణుజు, కొండగొర్రెలు, దుప్పులు అధికంగా ఉండేవి. వీటితో పాటు రెండు పులులు కూడా ఉండేవని అటవీశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వన్యప్రాణులు వేటగాళ్ల తూటాలకు, బాణాలకు బలివ్వడంతో వాటికి ఆహారం కొరత ఏర్పడింది. దీంతో వేరే చోటకు వలసపోవడంతో వాటి జాడ కనిపించడం లేదు.

అభయారణ్యాన్ని తలపించేలా..: సుమారు మూడు లక్షల ఎకరాల్లో విస్తరించిన మర్రిపాకల అటవీ ప్రాంతం గూడెంకొత్తవీధి, వై.రామవరం, అడ్డతీగల మండలాల మధ్య విస్తరించి ఉంది. అభయారణ్యాన్ని తలపించేలా అడవి దట్టంగా ఉన్నందున వన్యప్రాణులు సంచారం కూడా ఒకప్పుడు ఎక్కువగా ఉండేది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు, జగ్గంపేట ప్రాంతాలకు చెందిన వారితోపాటు ఒడిశాకు చెందిన వేటగాళ్లు విచ్చలవిడిగా అడవి జంతువులను వేటాడుతున్నారు. దీంతో వాటికి మనుగడ లేకుండా పోయింది. వీరికి కొన్ని ప్రాంతాల్లో స్థానికుల సహకారం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

మావోయిస్టుల కదలికలు లేకపోవడంతో..
ఒకప్పుడు మర్రిపాకలు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఎక్కువగా ఉండేవి. 2015లో ఈప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుల కీలకనేతలు చనిపోయారు. అప్పటినుంచి వారి కదలికలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు పూర్తిగా వారి ప్రభావం కనిపించడం లేదు. దీనిని ఆసరాగా తీసుకుని వన్యప్రాణుల వేటకు ఈప్రాంతాన్ని వేటగాళ్లు ఎంచుకున్నారు.

• ఒడిశాలో మల్కన్‌గిరి, కోరాపుట్టు ప్రాంతాల్లో దట్టమైన అటవీప్రాంతం ఉంది. వన్యప్రాణులు ఎక్కువగా ఉన్నప్పటికీ మావోయిస్టుల సంచారం, పోలీసులు కూంబింగ్ కారణంగా అక్కడ వేటాడేందుకు అనుకూల పరిస్థితులు లేవు. అందువల్ల ఒడిశాకు చెందిన సుమారు 40 నుంచి 50 మంది వేటగాళ్లు ద్విచక్ర వాహనాలపై మర్రిపాకల అటవీప్రాంతానికి వచ్చి వేటాడుతున్నారు.

• మర్రిపాకల, యర్రగొండ, చీడికోట, పడమసింగవరం, పుట్టకోట, "మండపల్లి ప్రాంతాల్లో కాలువల వద్దకు దాహార్తి తీర్చుకునేందుకు వన్యప్రాణులు వస్తుంటాయి. ఆయా ప్రాంతాల్లో మాటువేసి వేటాడుతున్నారు. వన్యప్రాణాల మాంసాన్ని ఇక్కడే ఎండబెట్టి ద్విచక్రవాహనాలపై ఒడిశాకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. వీరి తూటాలకు అధిక సంఖ్యలో అడవిగేదెలు బలయ్యాయి. ఇలా వేటాడి అడవి గేదెల మాంసాన్ని తీసుకువెళ్తున్న ఒడిశాకు చెందిన 13 మంది పోలీసులకు పట్టుబడటంతో కటకటాలు పాలయ్యారు.

విద్యుత్ ఉచ్చుతో..
మండలంలో వీరవరం, పాలసముద్రం, మర్రిపాకల తదితర మారుమూల ప్రాంతాల్లో కూడా విద్యుత్ కంచెతో వన్యప్రాణులను వేటాడుతున్నారు. నాలుగేళ్ల క్రితం పెదమాకవరం ప్రాంతంలో వన్యప్రాణుల కోసం ఏర్పాటుచేసి విద్యుత్ ఉచ్చులో పడి వ్యక్తి మృతి చెందాడు. అప్పటినుంచి ఈ రకమైన వేట తగ్గుముఖం పట్టినా ఏదో ఒకచోట జరుగుతూనే ఉంది.

• అడవి పందుల వినియోగానికి బాంబు (పందికాయ)లను వినియోగిస్తున్నారు. పేలుడు పదార్థాలతో తయారుచేసిన బాంబుకు మాంసాన్ని ఎరగా అమర్చి వేటాడుతున్నారు. బాంబును కొరికన క్షణంలో అడవి పంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

నిప్పంటుకోవడంతో..
తరచూ అడవుల్లో మంటలు ఎగిసిపడుతుండడం వల్ల చెట్లు కాలిపోతున్నాయి. మంటల వేడిమికి, అడవంతా వ్యాపించే పొగను తట్టుకోలేక అక్కడినుంచి వన్యప్రాణులు వేరే ప్రాంతాలకు వలసపోతున్నాయి.

నెమళ్లకు ముప్పు..
వై.రామవరం మండలంలో రంపుల ఘాట్, మందపల్లి, కొత్తపల్లి, కోతిగొంది, గుర్తేడు, ఎం.భీమవరం ప్రాంతాల్లో నెమళ్ల సంతతి ఎక్కువగా ఉండేది. ఇవి కూడా నేడు పూర్తిగా అంతరించిపోయాయి. వాటిని రకరకాలుగా వేటాడుతున్నారు. ఎరగా వేసిన ఆహారాన్ని తినేందుకు వచ్చిన నెమళ్లు ఉచ్చులో ఇరుక్కుంటున్నాయి. తెల్లని ఆవు ద్వారా కూడా వేటాడుతున్నారు. ఆవును చూడగానే నెమలి దగ్గరకు వస్తుంది. దాని పక్కనే తెలుపు వస్త్రంతో కప్పుకుని మాటువేసిన వేటగాడు వెంటనే దానిని పట్టుకుంటున్నాడు.

బాణాలను వీడి నాటు తుపాకులతో..

ఒకప్పుడు మన్యంలో సంప్రదాయ ఆయుధాలైన బాణాలతో వేటాడేవారు. ఇప్పుడు నాటు తుపాకులతో వేటాడుతున్నారు. వీటిని మైదాన ప్రాంతం నుంచి కొనుగోలు తీసుకువస్తున్నారు. గిరిజనుల్లో కూడా వీటిని తయారు చేసేవారున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో చాలావరకు నాటు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



వేటగాళ్ల తూటాలకు బలవుతున్న అడవిగేదె

పూర్తిస్థాయిలో సిబ్బంది లేక..

మర్రిపాకల అటవీ రేంజిలో సిబ్బంది కొరత కూడా ఎక్కువగా ఉంది. సిబ్బంది సుమారు 12 మంది వరకు ఉండాలి. ప్రస్తుతం రేంజి అధికారితో కలిపి ఐదుగురు మాత్రమే ఉన్నారు. పరిధి ఎక్కువ కావడం వల్ల గస్తీ తిరగడం కష్టంగా ఉంది. ఈ సందర్భంగా మర్రిపాకల రేంజర్ భార్గవ్ వర్మ మాట్లాడుతూ వేటగాళ్లు సంచరించే ప్రాంతాల వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. పూర్తి సమాచారం సేకరించిన వెంటనే వారిని కట్టడి చేయడమే కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మర్రిపాకల రేంజ్‌లో పర్యటించిన సీసీఎఫ్



అంతరించి పోతున్న కణుజులు

అడ్డుకట్ట వేస్తాం



మర్రిపాకల ప్రాంతంలో వేటగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తాం. ఇక్కడ సిబ్బంది సంఖ్యను పెంచేందుకు పరిశీలిస్తున్నాం. ఒడిశా వేటగాళ్లు వచ్చిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని మారుమూల గ్రామాల గిరిజనులను కోరాం. వారికి సంబంధించిన సమాచారంపై నిఘా ఏర్పాటుచేశాం.
– సూర్యనారాయణ పడాల్, డీఎఫ్‌వో, చింతపల్లి

విద్యుదీకరణ త్వరగా పూర్తి చేయండి



స్థానికుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఎండీ పృథ్వీరాజ్

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీరాజ్

అరకులోయ రూరల్: మారుమూల గ్రామాల్లో విద్యుదీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీరాజ్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని మాదల పంచాయతీ చిటంగొంది, నందివలస, డుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ అడపవలస గ్రామాల్లో పర్యటించారు. స్థానిక గిరిజనులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు, ఇటీవల కాలంలో పీవీటీజీ గ్రామాలతో పాటు ఇతర గ్రామాలకు ప్రారంభమైన విద్యుత్ లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకులోయ, డుంబ్రిగుడ మండలాలతో పాటు వివిధ మండలాల్లో జరుగుతున్న విద్యుత్ పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కొన్ని గ్రామాలకు విద్యుదీకరణ పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పర్యవేక్షణ ఇంజినీర్ మహేంద్రనాథ్, పాడేరు కార్యనిర్వహక ఇంజినీర్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.



తోటలగొందిలో విద్యుదీకరణ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

పనులు వేగవంతానికి ఆదేశం

జి.మాడుగుల: పీవీటీజీ, నాన్ పీవీటీజీ గ్రామాల్లో విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేంద్రనాథ్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలో రూ.7.93 లక్షలతో విద్యుదీకరణ చేపట్టిన కోరాపల్లి పంచాయతీ తోటగొంది గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జి.మాడుగుల మండలంలో పవీవీటీజీ గ్రామాల విద్యుదీకరణకు సంబంధించి 43 పనులకు గాను 27 పనులు పూర్తి కావచ్చాయన్నారు. మిగతా 16 పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సౌకర్యం వల్ల ప్రయోజనాలపై ఆయన ఆదివాసీల నుంచి తెలుసుకున్నారు. మండలంలో 1167 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కొత్త లైన్లు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు విద్యుత్ శాఖ ఈఈ ఎవీఎస్ఎం అప్పారావు, చింతపల్లి డీఈ కె సూర్యప్రకాష్, పాడేరు డీఈ మల్లేశ్వరరావు, జి.మాడుగుల ఏఈ ఎంవీ రమణ, జేఈ మాధవ్, పాడేరు జేఈ శ్రీనివాస్, ఎల్ఐ షాజహాన్ పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు పరిశీలకుల నియామకం

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పర్యవేక్షణ పరిశీలకులను ఎన్నికల కమిషన్ నియమించిందని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. తమిళనాడుకు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కె.వివేకానందన్‌ను అరకులోయ అసెంబ్లీకి, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డాక్టర్ గజేంద్ర కుమార్‌సింగ్‌ను పాడేరు అసెంబ్లీకి, బిహార్‌కు చెందిన రేణుకా శ్రీవాత్సవ్‌ను రంపచోడవరం అసెంబ్లీకి కౌంటింగ్ పర్యవేక్షణ పరిశీలకులుగా నియమించినట్టు ఆమె తెలిపారు.

ఆర్వోలు వీరే..
అరకులోయ సెగ్మెంట్‌కు పాడేరు, చింతూరు ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, చైతన్య, పాడేరు సెగ్మెంట్‌కు జేసీ భావన వశిష్ట, డీఆర్వో పద్మావతి, రంపచోడవరం సెగ్మెంట్‌కు సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, సూరజ్ గనోరేలు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు భేష్

• జిల్లా కోఆర్డినేటర్ డేవిడ్



వై.రామవరం సీహెచ్‌సీని సందర్శించిన జిల్లా కోఆర్డినేటర్ డేవిడ్, సూపరింటెండెంట్ రాహుల్

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు సంతృప్తికరంగా ఉన్నాయని ఆ పథకం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ డేవిడ్ సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఆరోగ్యశ్రీ సేవల వివరాలను తెలుసుకున్నారు. ఇన్‌పేషెంటు వార్డులో ఉన్న రోగులకు అందుతున్న ఆరోగ్యశ్రీ సేవలను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ రికార్డులను తనిఖీ చేశారు. మరిన్ని సేవలు అందించడానికి తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ రాహుల్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

• ప్రతిఒక్కరూ సహకరించాలి
• జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత, చిత్రంలో పాడేరు చింతపల్లి ఏఎస్పీలు

సాక్షి, పాడేరు: వచ్చేనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపును ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎం.విజయసునీత కోరారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫారం-18 ద్వారా కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించి, గుర్తింపుకార్డుతో కౌంటింగ్ కేంద్రానికి పంపాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్ల మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లేందుకు అనుమతులు లేవన్నారు. కౌంటింగ్‌కు 14టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అరకులోయలో 304 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్లు, పాడేరులోని 318 కేంద్రాలకు 23 రౌండ్ల లెక్కింపు జరుగుతుందన్నారు. రంపచోడవరంలో 20 టేబుళ్లు ఏర్పాటు చేసిన 399పోలింగ్ కేంద్రాల ఓట్లను 20 రౌండ్లలో లెక్కింపు చేపడతామన్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి 10,161 పోస్టల్ ఓట్లతో పాటు అప్పటివరకు అందిన సర్వీసు ఓట్లను ముందుగా లెక్కిస్తామన్నారు. రంపచోడవరం కౌంటింగ్ కేంద్రంలో 80, పాడేరు డిగ్రీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో 29 సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అలాగే కౌంటింగ్ సమయంలో సమస్యలు తలెత్తడానికి గల అవకాశాలు, పరిష్కారాలను ఆమె రాజకీయ పార్టీల నాయకులు,అభ్యర్థులకు అవగాహన కల్పించారు. చింతపల్లి,పాడేరు ఏఎస్పీలు ప్రతాప్‌శివకిషోర్, ధీరజ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎక్కడ ప్రజలు ఎటువంటి సమూహాలుగా ఉండకూడదన్నారు. కౌంటింగ్‌కు ముందు, తరువాత ఎలాంటి ఊరేగింపులు చేయరాదని, పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎలాంటి దూషణలు చేయవద్దన్నారు. బాణసంచాను నిషేధించామని, ఫేక్ న్యూస్‌లను ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 31వతేదీ నుంచి కౌంటింగ్ ముగిసే వరకు డిగ్రీ కళాశాల మార్గంలో మరింత భద్రత పెంచినట్టు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మావతి,పలు రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, వర్చువల్ విధానంలో రంపచోడవరం ఆర్వో ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

మలేరియా ప్రబలకుండా ప్రత్యేక చర్యలు

• యుద్ధప్రాతిపదికన స్ప్రేయింగ్, ఫాగింగ్
• పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : స్థానిక ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. ఏజెన్సీలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మలేరియా కేసుల సంఖ్య పెరుగుతున్నాయి. దీని దృష్ట్యా మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్‌తో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతగిరి, పాడేరు మండలాల్లోని పినకోట, ఈదులపాలెం పీహెచ్‌సీల పరిధిలోని పినకోట, పెదకోట, భీమవరం, పాడేరు పంచాయతీల్లో మలేరియా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు, మలేరియా సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం మలేరియా సిబ్బంది నివాస గృహాల్లో ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో పూడిక తీత చేపట్టి క్రిమి సంహారక మందులు పిచికారి చేయించాలని, విధిగా ఫాగింగ్ చేపట్టేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ నిమిత్తం అవసరమైన క్రిమిసంహాకర మందులు ఏజెన్సీలోని అన్ని పంచాయతీలకు సరఫరా చేయాలని పీవో కోరారు.

కూటమికి ఓటమి తప్పదు

• మళ్లీ రెండోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డే
• విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



రంపచోడవరం: ఈ ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓటమి తప్పదని, ఎన్ని పార్టీలు ఏకమై కుట్రలు, కుతంత్రాలు చేసినా మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మంగళవారం రంపచోడవరం విచ్చేసిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. విద్య , వైద్యం, అభివృద్ధి ఒక ప్రణాళికపరంగా జరిగిందన్నారు. ప్రజలకు మేలు చేయని పార్టీలన్నీ కూటమిలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రజల కోసం కాకుండా అధికార కాంక్షతోనే కూటమి పార్టీలు జతకట్టాయన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు ఈ మూడు పార్టీలు కలసినా రాష్ట్ర ప్రజలు ఏకపక్షంగా జగన్‌కే రెండోసారి పట్టం కట్టనున్నారని ఈ విషయం జూన్ 4ను తేలనుందన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల కోడ్ అమలుకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ ఫిర్యాదులు చేసినా ఈసీ పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో జగన్‌పై అనే రకాలుగా కూటమి నాయకులు సభల్లో వాడిన పదజాలాన్ని ఈసీ దృష్టికి తీసుకువెళ్లామని, అయినా సరిగ్గా స్పదించలేదని ఆయన విమర్శించారు.

బెస్ట్ వేల్యూ యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో ఏయూకు స్థానం

ఏయూక్యాంపస్ : బెస్ట్ వేల్యూ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ఇన్ ఏసియాలో ఏయూకు మెరుగైన స్థానం లభించింది. ఆసియాలోని 20 దేశాల్లో 3,349 ఉన్నత విద్య అందించే విశ్వవిద్యాలయాలను అధ్యయనం చేసి ఈ స్థానాలను ప్రకటించారు. ఏయూ అత్యుత్తమమైన వర్సిటీల్లో టాప్ 300లో నిలిచింది. అకడమిక్ క్వాలిటీ, విద్య సంబంధిత అంశాలను పరిశీలించి ఈ ర్యాంకింగ్ అందించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌కు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నీరభ్‌కుమార్ ప్రసాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

క్లుప్తంగా

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీ

- కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి మంగళవారం నిర్వహించిన స్పాట్ కౌన్సెలింగ్‌కు విశేష స్పందన లభించింది. విశాఖ జిల్లా పరిధిలో 3, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కంచరపాలెంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా 5వ తరగతిలో మొత్తం 71 సీట్లు భర్తీ చేశామన్నారు. బాలికలు 5వ తరగతిలో ప్రవేశానికి బుధవారం తాళ్లపాలెంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలుర అడ్మిషన్ కోసం 30న సబ్బవరం గురుకులంలో, బాలికల అడ్మిషన్ కోసం 31న మేహాద్రి గెడ్డ గురుకులంలో స్పాట్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

అప్పన్నకు భారీగా ఆదాయం

- హుండీ ఆదాయం 28 రోజులకు రూ. 2.60 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. సింహగిరిపై యాత్రికసదన్‌లో మంగళవారం స్వామివారి హుండీల ఆదాయం లెక్కించారు. 28 రోజులకుగాను రూ.2 కోట్ల 60లక్షల 71వేల 617 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సగటున రోజుకి రూ.9 లక్షల 31వేల 129 వచ్చినట్టు పేర్కొన్నారు. నగదుతో పాటు 116.200 గ్రాముల బంగారం, 20.540 కిలోల వెండి లభించినట్టు తెలిపారు. లెక్కింపులో దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఇంకా హుండీలు మిగిలిపోవడంతో బుధవారం కూడా ఆదాయాన్ని లెక్కించనున్నారు.

క్రీడాకారులకు అభినందనలు

కొంకోట: మహారాష్ట్రలోని పూణేలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ చదరంగం పోటీలో ప్రతిభ కనబరచిన జిల్లాకు చెందిన క్రీడాకారుల్ని ప్రగతి చెస్ అకాడమీ అధ్యక్షులు దువ్వూరి సత్యగాయత్రీదేవి, కార్యదర్శి దువ్వూరి సుధీర్, అనకాపల్లి చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కోచ్ మల్లికార్జునరావు మంగళవారం అభినందించారు. జిల్లా చెస్ అసోసియేషన్ నుంచి పోటీకి హాజరైన భీశెట్టి శ్రావ్యశ్రీ(ఎస్.రాయవరం) 1800 లోపు విభాగంలో 4వ స్థానం కైవసం చేసుకుందన్నారు. అనకాపల్లికి చెందిన కందలం తేజ 90 శాతం రేటింగ్ పెంచుకోగా, కందుల జయలక్ష్మి గట్టి పోటీ ఇచ్చారని పేర్కొన్నారు. భవిష్యత్ పోటీల్లో మరింతగా రాణించాలని అభిలషించారు.

పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత


శిక్షణకు హాజరైన అధికారులు, సిబ్బంది

కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పాడేరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గాల కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి కౌంటింగ్ ప్రక్రియపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడేరు, అరకులోయకు సంబంధించి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను, రంపచోడవరానికి సంబంధించి రంపచోడవరం జూనియర్ కళాశాలలోను ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పాడేరు డిగ్రీ కళాశాల కౌంటింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా కౌంటింగ్ హాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. జూన్ 4వ తేదిన జరిగే ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బంది అంతా ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. ఓట్లు లెక్కింపులో పలు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, క్రమశిక్షణ విధి విధానాలను పాటించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 13వతేదిన పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతూ , ఆదే స్ఫూర్తి, నిబద్ధతతో కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎటువంటి తప్పిదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలని ఆదేశించారు.

పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు మూడు టేబుళ్లు.. ఈవీఎంలకు 14 టేబుళ్లు: రంపచోడవరంలో 4,400, అరకులోయలో 3,600, పాడేరులో 2,600 పోస్టల్ ఓట్లు పోలయ్యాయని, ముందుగా పోస్టల్ ఓట్లు లెక్కించాలన్నారు.పోస్టల్ బ్యాలెట్‌లకు మూడు టేబుళ్లు, ఈవీఎంల లెక్కింపునకు 14టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.కౌంటింగ్ సిబ్బంది మొబైల్ ఫోన్లను వెంట తీసుకురావొద్దని, నిర్ధిష్టమైన సమయానికి విధులకు హాజరు కావాలని, కౌంటింగ్ ఏజెంట్లతో ఎలాంటి సంభాషణ చేయకూడదన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఫలితాల వెల్లడిలో అనుసరించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు.

పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు: ఏఎస్పీ ధీరజ్ జూన్ 4వతేదిన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పటిష్ట భద్రత మధ్య నిర్వహించనున్నట్టు పాడేరు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల పోలీసు భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బందికి జారీ చేసిన గుర్తింపు కార్డులు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, గుర్తింపు కార్డులు పోయిన, వెంట తీసుకురాకపోయినా ప్రవేశం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

ప్రవేశ మార్గాలివే...
అరకు అసెంబ్లీ, పార్లమెంట్ పరిధిలోని అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందికి స్థానిక ఎంపీడీవో కార్యాలయం జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల మార్గంలో ప్రవేశం కల్పిస్తున్నామని ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. టీటీడీ కల్యాణ మండపం వద్ద పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్‌కు చెందిన అభ్యర్థులు.ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు మీదుగా డిగ్రీ కళాశాలకు ప్రవేశం కల్పిస్తున్నామని, వాహనాలను జూనియర్ కళాశాల మైదానంలో పార్కింగ్ కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో డీఆర్‌వో బి.పద్మావతి, ఎస్‌డీసీలు శర్మ, అంబేద్కర్, కౌంటింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పోలీసు రమ్యకు సంతాపం

హుకుంపేట: పెదబయలు మండలంలోని గోమంగి సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తూ, ప్రసవ సమయంలో ఆరోగ్య విషమించి మృతి చెందిన గంపరాయి రమ్యకు అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ దంపతులు సంతాపం తెలిపారు. అడ్డుమండ గ్రామంలో మృతురాలు ఇంటి వద్దకు చేరుకుని రమ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి మాట్లాడుతూ గర్భిణిగా ఉంటు కూడా ప్రభుత్వ విధులను బాధ్యతగా నిర్విర్తిస్తూ రమ్య మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి తోడుగా ఉంటానని ధైర్యం చెప్పారు. సర్పంచ్‌లు గుమ్మా శ్యామ్ సుందర్, ముంచంగిపుట్టు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాదరి సురేష్‌కుమార్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్ కుమార్ తదితరులున్నారు.


రమ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అభ్యర్థి తనూజారాణి, వినయ్ దంపతులు

బైక్‌తో డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి


చంటి (ఫైల్)

అరకులోయటౌన్: మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు బైక్‌తో డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం అరకులోయ పట్టణంలో నివాసం ఉంటున్న జొన్నాడ చంటి (22) సోమవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం సమీపంలో మోటార్‌బైక్‌పై అతివేగంగా వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. చంటి మృతితో స్థానికంగా వ్యాపారస్తులు ఉదయం నుంచి దుకాణాలు మూసివేసి సంతాపం ప్రకటించారు.


చంటి మృతదేహం

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరం


సంతారిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో బాలచంద్రమణి దేవి, సిబ్బంది


జీకే వీధిలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది


చింతపల్లిలో మాట్లాడుతున్న సీడీపీవో రమణి

హుకుంపేట: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా స్త్రీలు తీసుకోవల్సిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో బాలచంద్రమణి దేవి చెప్పారు. భేటీ భచావో...భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంతారి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో స్త్రీ పోషించాల్సిన పాత్రపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలసరి సమయాల్లో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మంచి పోష్టిక ఆహారాలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది హసీనా, సిబ్బంది పాల్గొన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు.

గూడెం కొత్తవీధి: మండల కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి, వైద్యాధికారి అచ్యుత్ ఆధ్వర్యంలో కిశోర బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుస్రవం సమయాల్లో తరచూ న్యాప్కిన్‌లను మార్చాలని, వ్యక్తిగత పరిశుభ్రతను తూచా తప్పకుండా పాటించాలన్నారు. సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిణి తదితరలు పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో రమణి ఆధ్వర్యంలో కిశోర బాలికల సమస్యలపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు నెలసరి సమయంలో జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి, గౌహరున్నీసా, గౌరి, అప్పలనరసమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 852 మంది హాజరు


అల్లూరి డీఈవో బ్రహ్మాజీరావు


పరీక్షల టైమ్‌టేబుల్

రాజవొమ్మంగి: అడ్డతీగల ఏపీటీడబ్ల్యూఆర్ హైస్కూల్ కేంద్రంగా జూన్ 1వ తేదీ నుంచి జరుగనున్న ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 852 మంది హాజరుకానున్నట్టు అల్లూరి డీఈఓ బ్రహ్మాజీరావు మంగళవారం తెలిపారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌లోని 26 ఓపెన్ స్కూల్స్‌కు చెందిన అభ్యర్థులు ఇక్కడ పరీక్షలు రాయనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు చెప్పారు. జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం విడుదల చేసిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల టైం టేబుల్‌ను డీఈవో విడుదల చేశారు. జూన్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన భోజనం


కుక్‌లకు అవగాహన కల్పిస్తున్న మిడ్ డే మీల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ రాంబాబు

హుకుంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మరింత నాణ్యమైన రుచికరమైన భోజనం అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మిడ్ డే మీల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ రాంబాబు చెప్పారు. మండలంలోని స్థానిక గిరిజన సంక్షేమ శాఖ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కుక్ రుచికరమైన వంటల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలన్నారు. నాణ్యమైన ఆహారంతోనే విద్యార్థుల ఆరోగ్యం బాగుంటుందన్నారు. పాఠశాల కంప్యూటర్ ఆపరేటర్ జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


గంగాధర్(ఫైల్)

యలమంచిలి రూరల్: ప్రేమించిన యువతి తనతో మాట్లాడట్లేదని మనస్తాపానికి గురైన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు. యలమంచిలి పట్టణం ద్వారకానగర్‌కు చెందిన రోమాల గంగాధర్(24) పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పదో తరగతి వరకు చదువుకున్న గంగాధర్ ఖాళీగా ఉంటున్నాడు. యువకుడి తీరు నచ్చక, యువతి ఏడాదిగా అతడ్ని దూరం పెట్టింది. ఈ నెల 27న యువతి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెప్పేందుకు గంగాధర్ ఫోన్ చేశాడు. యువతి స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి ద్వారకానగర్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులెవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు మంగళవారం రాత్రి మీడియాకు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పశువులు

పాయకరావుపేట: జాతీయ రహదారి మీదుగా పశువుల అక్రమ రవాణాకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. వారి నుంచి 58 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. స్థానిక సీతారాంపురం గ్రామ సమీపాన గల హైవేపై 12 ఆవులు, 46 ఎద్దులతో రాజమండ్రి వైపు వెళ్తున్న వ్యాన్‌ను మంగళవారం పోలీసులు అడ్డుకున్నారు. పశువుల్ని స్వాధీనం చేసుకుని, వ్యాన్ యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. పశువులను కొత్తవలస గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేజీహెచ్‌కు కారు వితరణ



విశాఖ సిటీ: కేజీహెచ్‌లో వృద్ధులు, ఇతర రోగుల సౌకర్యార్థం ఎంవీపీ కాలనీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ బ్యాటరీతో నడిచే 8 సీటర్ కారును వితరణగా అందజేసింది. వేగవంతంగా రోగ నిర్ధారణకు, పోర్టు గ్రాడ్యుయేట్లకు మెరుగైన బోధన కోసం ఈఎన్‌టీ విభాగానికి రెండు ఎండోస్కోపీ యంత్రాలు ఇచ్చింది. వీటిని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి హెచ్‌వోడీ ప్రొఫెసర్ హరికృష్ణలకు మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ వి.మురళీకృష్ణ అందజేశారు. కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.10 లక్షలతో వీటిని అందజేసినట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. కారుతో పాటు డ్రైవర్‌ను కూడా ఏర్పాటు చేయడం పట్ల కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ మహాత్మా గాంధీ ఆస్పత్రి ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో పాటు రోగుల సంక్షేమానికి క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం కృషి చేస్తోందని కొనియాడారు.

నూకాలమ్మ ఆలయంలో చోరీ

పట్టపగలే హుండీల్లో నగదు అపహరణ


నూకాంబిక అమ్మవారి ఆలయంలో పరిసరాలను పరిశీలిస్తున్న పట్టణ పోలీసులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుకనున్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలు దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ తర్వాత ఆలయ ఆవరణలో ఉన్న రెండు హుండీల తాళాలను పగులగొట్టి వాటిలో ఉన్న నగదును దోచుకుపోయారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఆలయంలో సీసీ కెమెరాలున్నా చోరీ దృశ్యాలు రికార్డవలేదు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆలయం తలుపులు మూసివేసి అర్చకుడు, ఆలయ కమిటీ సభ్యులు ఇళ్లకు వెళ్లిపోయారు. తిరిగి సాయంత్రం 4 గంటల సమయంలో ఆలయానికి వచ్చేసరికి, హుండీలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. అమ్మవారి విగ్రహానికి సుమారు 6 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి. గర్భగుడి తలుపులు వేసినా, తాళం వేయలేదు. అదృష్టవశాత్తూ చోరీకి పాల్పడిన వారు ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. చోరీ సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు, సిబ్బంది ఆలయానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకునితో మాట్లాడారు. హుండీల్లో ఎంత నగదు ఉండవచ్చని అడిగి తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి క్లూస్ టీం సభ్యులు నిందితుల వేలి, పాద ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. నిత్యం రద్దీగా ఉండే ఆలయ ప్రాంతంలో చోరీ జరగడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల నుంచి సరైన స్పందన లేక, పలు భద్రతా పనుల నిమిత్తం కొన్ని రైళ్లు రద్దు చేస్తున్నట్లు మరికొన్ని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-కాచిగూడ-సంబల్‌పూర్ (08325/08326) మధ్య నడుస్తున్న సమ్మర్ స్పెషల్‌కు ప్రయాణికుల నుంచి సరైన స్పందన లేనందున సంబల్‌పూర్-కాచిగూడ స్పెషల్ రైలు జూన్ 17, 24, కాచిగూడ-సంబల్‌పూర్ స్పెషల్ జూన్ 18, 25వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. లమ్‌డింగ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ నెల 31వ తేదీన ఎస్ఎంవీ బెంగళూరులో బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ను రద్దు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


పలాసి లలితేష్‌ను 108 వాహనంలో తరలిస్తున్న వైద్య సిబ్బంది


క్షతగాత్రులను ఆటోలో ఎక్కిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు ధర్మారావు తదితరులు

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ తరరాడ గ్రామ సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ముంచంగిపుట్టు నుంచి వస్తున్న స్కూటీ పెదబయలు నుంచి వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముంచంగిపుట్టు మండలం దుర్గగుడ గ్రామానికి చెందిన పలాసి లలీతేష్(15) కుడికాలు విరిగింది. తలకు గాయమైంది. పలాసి దాసు కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు చెప్పారు. ఆ సమయంలో అదే మార్గంలో పెదబయలు వస్తున్న ముంచంగిపుట్టు మండల వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పాంగి ధర్మారావు క్షతగాత్రులను మరో ఆటోలో ఎక్కించి పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. వైద్య సిబ్బందితో మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారితో మాట్లాడారు. కుడికాలు విరిగిన పలాసి లలీతేష్‌కు పాడేరు జిల్లా ఆస్పత్రికి రిఫరల్ చేయడం జరిగిందని పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. ఈ విషయంపై పెదబయలు పోలీసులు కేసు నమోదు చేశారు.